క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం-1 పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ బుధవారం వైద్య సేవలు అందించారు. డాక్టర వెంకటకృష్ణకుమార్ 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఇందులో 35మందికి బీపీ మందులు, 29మందికి షుగర్‌కు సంబంధించి మందులను నెలకు సరిపడ అందించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సీవీ రమణ, ఎమ్‌ఎల్‌హెచ్ అలేఖ్య, ఏఎన్‌ఎం విమల, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో ఫ్యామిలీ పిజీషియన్

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, వి.సూర్యప్రకాశరావులు పాల్గొని 111 మందికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ రహిమున్నీసా, కమల, ఏఎన్‌ఎమ్ అనురాధ, మస్తాన్‌బి, డీఈఓ రవితేజ, ఎంపీహెచ్‌ఎస్ పీటర్‌డానియేల్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు



అచ్చంపేట: మండలంలోని చామర్రులో పవిత్ర కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న విఘ్నేశ్వరుని ఆలయంలోని కాశీవిశ్వేశ్వరునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి అనిల్‌శాస్త్రి ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

గోదా అమ్మవారికి సారె

సత్తెనపల్లి: పట్టణంలోని గడియార స్తంభం వద్ద గల కోదండ రామాలయంలో గోదా రంగనాయక స్వామి కల్యాణం జరిగి ఐదో రోజు అయిన సందర్భంగా బుధవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడి నుంచి ఊరేగింపుగా రామాలయ భక్త బృంద మహిళలు గడియార స్తంభం వద్ద గల రామాలయం వద్దకు వచ్చి గోదా సమేత రంగనాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదా అమ్మవారికి సారె కార్యక్రమం జరిపించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదన్ రావు, గోశాల అధ్యక్షుడు మాడ నాగ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు.

మండల సచివాలయ కన్వీనర్‌గా భవిరిశెట్టి



అమరావతి: వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్‌గా మండల పరిధిలోని మల్లాది గ్రామానికి చెందిన భవిరిశెట్టి హనుమంతరావు నియమితులయ్యారు. మంగళవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హనుమంతరావును మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా భవిరిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అలాగే పేదలకు ప్రభుత్వ పథకాలు అందించేలా సచివాయల కన్వీనర్లను, గృహసారథులను సమన్వయం చేసుకుని పని చేస్తానన్నారు. ఈసందర్భంగా హనుమంతరావును పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్

ముప్పాళ్ళ: మండలంలోని ముప్పాళ్ళ, నార్నెపాడు, లంకెలకూరపాడు గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ బుధవారం పరిశీలించారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా ప్రస్తుతం భూములు గుర్తించడం జరుగుతుందన్నారు. సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూములకు సంబంధించిన ఆధారాలను, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ వివరాలు అందించినట్లయితే సర్వే వేగవంతం అయ్యేందుకు వీలుంటుందన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు సర్వే బృందం సభ్యులకు సహకరించాలన్నారు. ఆయనతో పాటుగా డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆయా గ్రామాల వీఆర్వోలు ఉన్నారు.

ఉపాధికి 'సెల్ ఫోన్' హామీ

- ఆధార్ అనుసంధానం తప్పనిసరి
- అక్రమాలకు అడ్డుకట్ట
- ఉపాధి హామీలో కొత్త విధానం



ఉపాధిహామీ పనులు పర్యవేక్షణ చేస్తున్న ఏపీఓ వెంకటనారాయణ

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరింత పారదర్శకత తేవాలని అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కూలీల హాజరు వేసేందుకు మేటీలు సెల్‌ఫోన్‌లో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌ని అందుబాటులోకి తెచ్చింది. ఈనెల ఖచ్చితంగా ఆన్‌లైన్‌లోనే హాజరు వేసేందుకు చర్యలు చేపట్టింది. తాజాగా ప్రభుత్వం కూలి చెల్లింపు విధానంలో కొత్త విధానం అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన జాబ్ కార్డులకు ఆధార్ నమోదు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ విధానం చేపట్టడం ద్వారా బోగస్ కూలీలకు చెక్ పెట్టడమే కాకుండా అర్హులైన కూలీలు ఖాతాల్లో నేరుగా కూలి నగదు జమ కానుంది. ఆధార్ అనుసంధానం లేకుండా కూలీలకు ఉపాధి పనులకు వెళ్లే అవకాశం ఉండదు. ఆధారు అనుసంధాన ప్రక్రియ వేగంగా పూర్తి చేయాల్సి ఉంది.

క్లస్టర్ పరిధిలో 75,057 మందికి జాబ్ కార్డులు...

సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 75,057 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిల్లో 67,550 ఆధార్ అనుసంధానం అయ్యాయి. ఇంకా 7,507 ఆధార్ అనుసంధానం కావాల్సి ఉంది. గతంలో ఓ కుటుంబంలో తండ్రి, కుమారులు, సోదరులకు ఒక జాబ్ కార్డు ఉండేది. కుమారుడికి వివాహమైతే వేరే జాబ్ కార్డు పొందేవారు. కుమార్తెకు వివాహమై వేరే ప్రాంతానికి వెళ్లి మరో జాబ్ కార్డులో చేరేవారు.

పాత కార్డులో వీరి పేర్లు మాత్రం తొలగించలేదు. ఈ క్రమంలో వేతనాలు చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలతో పాటు పథకాలు దుర్వినియోగం అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఆధార్ అనుసంధానం ద్వారా అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావించింది. దీని ద్వారా ఒకటి కన్నా ఎక్కువ కార్డుల్లో పేర్లు ఉంటే వాటిని తొలగించనున్నారు.

యాప్‌లో నమోదు.....

ప్రభుత్వ ఇటీవల తెచ్చిన నూతన మార్గదర్శకాల ప్రకారం ఒక కూలీకి పని కల్పించా లంటే నేషనల్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్(ఎన్ఎంఎంఎస్) నమోదు తప్పనిసరి చేశారు. గతంలో 20 మందికి పైగా కూలీలకు పని కావాలంటే ఎన్ఎంఎంఎస్‌లో నమోదుకు స్వస్తి పలికారు. పనుల పర్యవేక్షణ, పనుల కల్పన, హాజరులో పారదర్శకత పెరుగు తుందని అధికారుల భావన. పనికి వచ్చిన వేతన దారుల సంఖ్య, పని చేస్తున్న సమయం తదితర అంశాల్లో అక్రమాల నిరోధానికి యాప్ దోహదపడుతుంది.

సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలో పంచాయతీలు, జాబ్‌కార్డులు ఇలా..

మండలం	పంచాయతీలు	జాబ్‌కార్డులు	ఆధార్ అనుసంధానం పూర్తి
సత్తెనపల్లి	25	11,532	10,763
ముప్పాళ్ళ	14	7,184	6,384
రాజుపాలెం	18	8,911	8,144
నకరికల్లు	17	10,360	9,560
పెదకూరపాడు	20	7,829	7,062
అమరావతి	20	6,154	5,954
అచ్చంపేట	23	8,150	7,183
క్రోసూరు	18	8,211	6,839
బెల్లంకొండ	13	6,726	5,661
మొత్తం	168	75,057	67,550

ఆధార్ అనుసంధానం వేగవంతం



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియకు సంబంధించి ఏపీఎంలు, సాంకేతిక సహాయకులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా పనులు కల్పనలో అంచనాలు, వేతనాలు చెల్లింపుల్లో ఇబ్బందులు అధిగమించేందుకు ఇది దోహదపడుతుంది.

– పీ.వెంకటనారాయణ, ఏపీఓ, సత్తెనపల్లి.

అభివృద్ధిని చూసి స్వచ్ఛందంగా చేరికలు

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- వైఎస్సార్ సీపీలో చేరిన 45 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు

నాగవరం (క్రోసూరు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలు, అమలు చేస్తున్న అభివృద్ధి పనులు చూసి టీడీపీ శ్రేణులు భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం మండలంలోని నాగవరం గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో 45 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారందరికీ కండువాలు వేసి ఘనంగా స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన జనరంజకంగా సాగుతుందనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. నాగవరం గ్రామంలో రూ.80 లక్షలతో నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలు బాగు చేసామన్నారు. గ్రామంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలు నిర్మిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిలో కనీసం పదిశాతమైనా టీడీపీ చేసిందా అని ప్రశ్నించారు. మాటలతో కాలం వెల్లబుచ్చిన తెలుగుదేశంపార్టీ నుంచి రోజురోజుకు ఇంకా చాలామంది దూరమవుతారని అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని చెప్పారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో సీనియర్ టీడీపీ నాయకులు బాదినేడి వీరరాఘవయ్య, చిమటా ప్రభాకరరావు, ఉపసర్పంచి అంకమ్మరావు, చిమటా సుబ్బారావు, తాడిబోయిన తిరుపతయ్య, బారిగోర్ల నాగరాజు, సురేష్, వీరబాబు, పిన్నబోయిన నరసింహారావు, తాడిబోయిన కొండా, చిమటా కృష్ణ, గీతకల్లు నాగరాజు, చిమటా గోపిరాజు, బారిగోర్ల గోపి, చిమటా మల్లయ్య, సైదులు, ముప్వా వెంకటేశ్వర్లు తదితర 160 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పఠాన్ మస్తాన్‌వలి, షేక్ సుభాని, సానికొమ్ము సహదేవరెడ్డి, ఆవుల సాయి, తన్నీరు తాతారావు, వడ్లమూడి దేవదానం, గ్రామ అధ్యక్షుడు అంకమ్మరావు, షేక్ బాజీ, షేక్ బాబు, క్రోసూరు ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, క్రోసూరు గ్రామ ఉపసర్పంచి షేక్ మస్తాన్, గార్లపాటి దాసు, అనుముల కోటిరెడ్డి, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, గంజినబోయిన శ్రీనివాసరావు, బెల్లంకొండ ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి, షేక్ గఫూర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, మేదర రోశయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు..

పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామంలో టీడీపీ నుంచి పెదకూరపాడు ఫ్రెండ్స్ సర్కిల్ ఆటో యూనియన్‌కు చెందిన 15 కుటుంబాలకు చెందిన సభ్యులు బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ రోజురోజుకు మరింత బలోపేతం అవుతోందన్నారు. పార్టీలో చేరిన వారిలో షేక్ ముస్తఫా, రహమత్‌అలి, రజాక్, జారీ, రాజు, మాణిక్యరావు, సైదా ఖాన్, సయ్యద్ బాషా, అహ్మద్ ఖాన్, సయ్యద్ మాబు, బాజీ,తదితరులు ఉన్నారు. వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు భయంకర్ సుభాని, షేక్ అదంషఫీ, కరీముల్లా, రహమత్ అలీ, సినిమాహాలు బాజీ ఉన్నారు.



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వనివీ నెరవేర్చాం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- నాగవరంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

నాగవరం(క్రోసూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల హామీలన్నీ అమలు చేయటమేకాక, ఇవ్వని హామీలుకూడా అమలు చేశారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం మండలంలోని నాగవరం గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగవరంలో రూ.11.33 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో అందజేయటం జరిగిందన్నారు. అదేవిధంగా అభివృద్ధి పనుల్లో నాడు-నేడు ద్వారా రూ.82 లక్షలతో పాఠశాలలు రూపురేఖలు మార్చటం జరిగిందన్నారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ నిర్మిస్తున్నామని అన్నారు. రూ.97లక్షలతో ప్రతి ఇంటికీ కుళాయి అందించే పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకుగాను రూ.22.14లక్షలు ఖర్చు చేయటం జరిగిందన్నారు. తెలుగుదేశంపార్టీ మాదిరిగా మయ మాటలు తాము చెప్పమని, నిజాలు చెబుతామని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. గ్రామంలోని పార్టీ నాయకులు, క్రోసూరు మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు 3వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం పట్టణంలోని 3వ వార్డులో గురువారం సాయంత్రం 6 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీలసి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. పట్టణంలోని మూడో వార్డు పరిధిలో గల చెంచు కాలనీ వద్ద నుంచి ప్రారంభ మవు తుందన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్‌మెంబర్లు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మైనర్ బాలికపై అత్యాచారయత్నం

రాజుపాలెం: మండలంలోని కొండమోడు ఎస్టీ కాలనీ సమీపంలో ఓ మైనర్ బాలికపై యువకుడు అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. మంగళవారం సాయంత్రం మైనర్ బాలిక ,తల్లి ఇరువురు కలిసి ఇంటి వద్ద నుంచి కొండమోడు జంక్షన్‌కు బయలుదేరారు. తల్లి చకచక నడుచుకుంటూ వెళ్తుండా మైనర్ బాలిక సెల్‌ఫోన్ చూస్తూ వెనుకంజలో ఉంది. ఇదే క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బాలికను వెంటపడి చెయ్యి పట్టుకుని పక్కకు లాగి చీకటి రోడ్డులోకి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి ప్రయత్నించగా తల్లి చూసి కేకలు వేయడంతో యువకుడు పరారయ్యాడు. తల్లి వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి యువకుడిపై ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం స్థానిక ఎస్ఐ షఫీ, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని జరిగిన విషయాన్ని బాలిక ద్వారా తెలుసుకుని కేసు నమోదు చేశారు. యువకుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు గాలిస్తున్నారు.

ఎంపీటీసీ రోశమ్మకు ఎమ్మెల్యే నివాళి

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు ఎంపీటీసీ సభ్యురాలు బంకా రోశమ్మ మంగళవారం అనారోగ్యంతో మరణించారు. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు ఎంపీటీసీ బంకారోశమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రోశమ్మ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు మాదినేని హరిబాబు, నరసయ్య ఉన్నారు.

బ్యాంకు రుణాలతో మహిళా సాధికారత సాధ్యం

సత్తెనపల్లి: ప్రభుత్వం అందిస్తున్న ఉన్నతి, చేదోడు, శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు ద్వారా తీసుకున్నటువంటి రుణాలను ఆయా యూనిట్లకు ఖర్చు చేసి ఆర్థిక అభివృద్ధి సాధించిన నాడు మహిళా సాధికారత సాధ్యమవుతుందని సత్తెనపల్లి మండల అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్ శిఖా కృపావేణి అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో గల మండల వెలుగు కార్యాలయంలో బుధవారం దళిత ఆదివాసీ మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సదస్సుకు డీబీఆర్సీ పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ మండల చిన్నప్ప అధ్యక్షత వహించారు. మండల కమ్యూనిటీ కోఆర్డినేటర్ బుల్లిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం రుణం మంజూరు చేస్తారో ఆ యూనిట్ ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఆర్థికంగా ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ స్వయం సహాయక సంఘాలకు ఉన్నతి పథకం ఎంతో ఉపయోగకరమైందని దానిని ఉపయోగించుకొని దళిత, గిరిజన స్వయం సహాయక సంఘాల సభ్యులు అభివృద్ధి చెంది తిరిగి మరల ఎక్కువ రుణాలు తీసుకోవడానికి తోడ్పడాలన్నారు. సదస్సులో సీసీ డేనియల్, వివిధ గ్రామాల నుంచి మహిళలు హాజరయ్యారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలు

నకరికల్లు: విద్యుత్‌షాక్ గురై ఎనిమిదేళ్ల బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక ఎస్టీ కాలనీలో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాలనీకి చెందిన సీహెచ్.గౌతం 3వతరగతి చదువుతున్నాడు. పాఠశాల సమీపంలో గాలిపటంతో ఆడుకుంటుండగా ఎగిరి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దాన్ని తీసేందుకు వెళ్లడంతో బాలుడు తీవ్ర విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. రెండుచేతులు మోచేతుల వరకు కాలి తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు, కుంటుబ సభ్యులు క్షతగాత్రుడిని హుటాహుటీన నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కాగా పాఠశాల సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు.

గృహ సారథులతో సంక్షేమం మరింత చేరువ

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రయ్య



మాట్లాడుతున్న చంద్రయ్య

అచ్చంపేట: సంక్షేమ పథకాలను అత్యంత చేరువ చేసేందుకు గృహసారథుల నియామకాలు జరుగనున్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ప్రతి 50 ఇళ్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న వలంటీర్లతో పాటు మరో ఇద్దరు గృహసారథులు పనిచేస్తారని తెలిపారు. వీరిలో ఒకరు పురుషుడు, ఒక మహిళ ఉంటారని చెప్పారు. వీరు ముగ్గురు సమన్వయంతో పనిచేయడం వల్ల అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వీరు సక్రమంగా పనిచేసేవిధంగా సచివాలయాల కన్వీనర్లు చూస్తారన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని సమర్థవంతంగా నడిపించడానికి వీరందరిపై మండలస్థాయిలో గృహసారథుల కన్వీనర్ పనిచేయనున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకుల పర్యవేక్షణలో ప్రజలందరికీ ప్రభుత్వ పాలనను చేరువ చేసేందుకు, అర్హత ఉండి ఏ ఒక్కరు సంక్షేమపథకాలు అందలేదని చెప్పే ఆస్కారం లేకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అహర్నిశలు కృషిచేస్తున్నారని చెప్పారు. మండల గృహసారథుల కన్వీనర్ శింగారెడ్డి రామకృష్ణారెడ్డి, సర్పంచి కంబాల వీరబాబు, పంచాయతీ కార్యనిర్వహణాధికారి సు బ్బారావు, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్న యల్లమందయ్య, మాజీ సర్పంచి టీవీఎస్ మ ల్లికార్జునరావు, సచివాలయ కన్వీనర్లు అన్నవర పు శ్రీనివాసరావు, షేక్ నాగులు, టౌన్ పార్టీ కన్వీనర్ షేక్ సమరం, ఉపసర్పంచ్ జాని, ఉప ఎంపీపీ తెల్లమేకల నాగరాజు, గ్రామ వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధిని ఇంటింటికీ చెప్పండి

ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: మూడున్నర ఏళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గృహసారథుల నియామకంపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా వలంటీర్లు, గృహసారథులు పని చేయాలని తెలిపారు. ప్రతీ 50 ఇళ్లకు ఇద్దరు గృహసారథులను నియమించాలని, ఇద్దరిలో ఒక మహిళను ఎంపిక చేయాలని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, భద్రయ్య, సర్పంచ్‌లు ఆసుల జగన్, నరసింహా నాయక్, సైదయ్య, శేషిరెడ్డి, బాబూజీ, వెంకటస్వామి, రమణారెడ్డి, బ్రహ్మం, శ్రీను, ఎంపీటీసీలు రేగులగడ్డ శ్రీను, రాంబాబు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు నకరికల్లు క్రీడాకారులు



నకరికల్లు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు పోటీలకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వతేదీన నంబూరులో నిర్వ హించిన ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థిని నెమలికంటి శ్రీజ 200మీటర్ల పరుగుపందెంలో మొదటిస్థానం, 400 మీటర్లు, 600 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానాన్ని కై వసం చేసుకుందన్నారు. పొనాది లేఖ్యసాయితులసి డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానం సాధించగా, రమావత్ రవితేజనాయక్ హైజంప్‌లో ప్రథమస్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

గెలుపొందిన క్రీడాకారులు శ్రీకాకుళంలో ఈనెల 20,21,22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడతారన్నారు. ఎంపికైన క్రీడాకారులకు, వారికి శిక్షణనిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, క్రీడాఉపాధ్యాయులు షేక్.ఫాతిమా, కె.వెంకటేశ్వర్లులను విద్యాకమిటీ ఛైర్మన్ షేక్.ముప్పాళ్ల మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవిలు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



దొడ్లేరు ఆర్బీకే వద్ద వరినారు శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దొడ్లేరు(క్రోసూరు): గ్రామంలో పృకృతి వ్యవసాయం డివిజన్ మాస్టర్ ట్రైనీ సైదయ్య ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు రబీ సీజన్‌లో వరిలో ఏఏ పద్ధతులు పాటించాలన్న విషయాల పై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్బీకే వద్ద వరి నారును బీజామృతంతో నారు శుద్ధి చేయడాన్ని చేసి చూపించారు. అలా శుద్ధి చేసిన నారు వలన ప్రధాన పంట తెగుళ్లబారిన పడకుండా ఉంటుందని, కొసలు తుంచి నాటటం వలన కాండం తొలిచే పురుగు, రసం పీల్చే పురుగు గుడ్లను పూర్తిగా నశింప చేయవచ్చునన్నారు. పంటను పురుగుల బారిన పడకుండా రక్షించుకోవటమే కాక పిలకలు బాగా వృద్ధి చెందుతాయన్నారు. ఈ విధానం పాటించటం వలన రైతుకు ఎటువంటి ఖర్చు ఉండదన్నారు. ఆర్బీకే వీఏఏ కమల, ఏఎన్ఎం అనుపమ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయ నిర్మాణానికి చర్యలు



మంత్రి అంబటి రాంబాబుతో చర్చిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్

సత్తెనపల్లి: పట్టణంలోని లక్కరాజు గార్లపాడు బస్ స్టాప్ సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనాన్ని కూల్చి వేసేందుకు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గ్రంథాలయ స్థలంలో నూతనంగా మహిళల కోసం ప్రత్యేకంగా డిజిటల్ గ్రంథా లయాన్ని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా కామన్ హాల్ ఏర్పాటు చేసి పాఠకులకు, ప్రజలకు అనుగుణంగా తీర్చిదిద్దేలా చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును కలిసి ఆయన మాట్లాడారు. గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారిలో ప్రస్తుతం నడుస్తున్న గ్రంథాలయ భవనంలోని గదుల వేలం, రావాల్సిన బకాయిలు, గ్రంథాలయ సెస్ గురించి చర్చించారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకుడు వై.బ్రహ్మయ్య, గ్రంథాలయ అధికారిణి కె.వాణి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నియోజకవర్గంలో రెండు వర్గాలుగా ఎన్టీఆర్ వర్ధంతి

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27 వర్ధంతిని టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి బుధవారం నిర్వహించారు. మాజీ శాసన సభ్యుడు వైవీ ఆంజనేయులు, టీడీపీ నాయకుడు డాక్టర్ కోడెల శివరాం వేరువేరుగా పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిమకు పూలమాలవేసి నివాళులర్పించారు. వేరు వేరుగా అన్న సంతర్పణలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని వివిధ వార్డుల్లో, గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు వేరువేరుగా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.